# సింధూర కుసుమం



కాలెపు శివశేఖర్

ఆ బాబుకి లంకంత యిల్లుంది.

ఆ యింటి గోడలకు బంగారపు యిటుకలున్నాయ్- యినప్పెట్లో లక్ష లున్నాయ్- వజ్రాలున్నాయ్- వైఢూర్యా లున్నాయ్-!

ఒక్క-మాటలో చెప్పాలంటే లక్ష్మీ దేవి, విష్ణుమూర్తితో పోట్లాడి- వైకుంఠాన్ని వదిలేసి, మొగుడిమీద అలిగేసి, భూలోకానికి వచ్చేసి తిన్నగా ఆ బాబు యింట్లో కాపురం పెట్టేసిందా-అన్పిస్తోంది.

లక్ష్మీదేవి అడ్రస్ తెలియని విష్ణుమూర్తి- దరిద్ర నారాయణమూర్తి అవతారమెత్తేసి, భూమ్మీద కొచ్చేసి, అందునా భారతదేశాని కొచ్చేసి, అల్లదిగో ఆ బాబు లంకంత యింటికి రెండు ఫర్లాంగుల దూరంలో బోర్లించిన మట్టిగిన్నెల్లావున్న గుడిసెలమధ్య తిరుగాడుతూ సోలో సాంగ్స్ పాడుకుంటున్నాడు. దరిద్రనారాయణమూర్తి 'గాలి' కాస్తంత తగిలిన ఆ గుడిసెవాసులు మరింత దరిద్రులై పోయారు.

ఆ బాబుమాత్రం మరింత పెరిగి పోయాడు.

ఆ బాబుకి లంకంత యింటితోపాటు ఖరీదైన బానకడుపు కూడా వుంది- అతన్తో పాటు అతని కడుపు కూడా ఎందుకనో అలా పెరిగిపోయింది.

చానాళ్ళక్రితం- అంటే చాలా ఏళ్ళ క్రితం అతని పెళ్ళాం నెల తప్పింది. నెల తప్పిన పెళ్ళానికి నెల్లు నిండాక ఆమెతో పాటు అతను కూడా ఆసుపత్రి కెళ్తే ఆడున్న డాక్టరమ్మకి అసలు ఆ యిద్దర్లో కడుపెవరికో అర్ధంకాక, మొదట కంగారు పడిపోయి, యిదేదో సృష్టి విపరీతమని

వాపోయి, అనక స్థిమితపడి ఆ బాబుకి కాక బాబు పెళ్ళానికే కడుపని నిర్ధారణ చేసుకుంది.

కనుక — ఆ వూళ్ళో నెలలు నిండిన ఆడోళ్ళకు తప్ప మరే మగాడికీ కడుపుండదు— ఉన్న కడుపల్లా ఆ బాబుకే!

అతనికి ఖరీదైన కడుపుతో పాటు ఖరీదైన కారుకూడా వుంది. నిజానికి ఆ కారు భారతదేశపు రోడ్లమీద నడవకూడదు. కానీ, కారుగల ఆసామి భారతదేశపోడు కాబట్టీ, రోడ్లు భారతదేశానివి కాబట్టి గతిలేక ఆ కారు యీ రోడ్లమీద మూలుగుతూ, ముక్కుతూ నడుస్తోంది. లేకపోతే అమెరికాలో కొన్న కారుపట్టుకొని యిలా ఇండియా రోడ్లమీద యీడ్చేయడం క్షమించరాని నేరం— చేయనటువంటి పాపం!

అసలు కథను వదిలేసి, కార్లలో పయనించడం నాలాంటి రచయితకి మంచిదికాదు కాబట్టి, అసలు కథ ఏమిటంటే—

ఆ బాబుకి వయసొచ్చిన కొడుకున్నాడు.

ఆ కొడుకు హిందీ సిన్మా హీరోలా వుంటాడు. తెలుగు సినిమా హీరోలా డైనింగ్ టేబుల్‌దగ్గరో డ్రస్— అక్కడ్నుంచి గుమ్మంలోకొచ్చేసరికో డ్రస్— గుమ్మంలోంచి కారుదగ్గరకొచ్చేసరికో డ్రస్— కారు డ్రైవ్‌చేసుకుంటూ రోడ్డుమీద కొచ్చేసరికో డ్రస్ చేసుకొంటూ యిలా ప్రతీషాట్‌కీ డ్రస్‌లు మార్చేసి, అటు హిందీసిన్మా హీరోలా, యిటు తెలుగు సినిమా హీరోలా తన పాత్రకు పూర్తిన్యాయం చేకూర్చేస్తున్నాడు.

బాబుగారికి పుట్టినోడుకాబట్టి.... ఈ బాబుకి వాళ్ళబాబు ఓ పేరంటూ పెట్టినా, ఆ పేరు సాధారణంగా ఎవరికీ తెలీదు. ఆఖరికి అతనికి పేరెట్టిన వాళ్ళబాబే కొడుకుపేరు మర్చిపోయాడు - జ్ఞాపకం అంటూ వుంటే అతన్ని కన్నతల్లి కుండాలి. కానీ, కన్నతల్లి కన్నుమూసి చానాళ్ళయిపోయింది. అంచేత అతని పేరు చాలామందికి 'చినబాబు'గానే తెలుసు.

వయసొచ్చిన చినబాబు నిక్కర్లలోంచి పాంట్లలోకి ఎదిగిపోయాక, తన పాంటుకి ఓ చీరచెంగు తగిలిస్తే బావుణ్ణని అనుకున్నాక, (నిజానికి అతను అనుకోలేదు) అతనిచుట్టూ చేరిన మిత్రబృందం చినబాబుని ఎక్కడెక్కడికో తీసుకుపోయారు.

తీసుకుపోయిన చోట్లల్లా చినబాబుకి చాలా చాలా చీరచెంగులు తగిలాయి - కొన్నిచోట్ల చీరచెంగుల్లేకుండానే లంగా, జాకెట్లు తగిలాయి - మరికొన్ని చోట్ల అసలు గుడ్డలేలేని ఆడశరీరాలు తగిలాయి!

ఏమైనా చినబాబు చాలారకాలు చూసేశాడు. తనెంతో ఎదిగిపోయానని తెలుసుకున్నాక... చదువులో ఏమాత్రం ఎదగలేక....కష్టపడి చదువు చదివేకన్న....

తేలిగ్గా చీరచెంగులు లాగొచ్చని.... చక్కా తనూరొచ్చేశాడు.

ఇలా అర్ధాంతరంగా చదువాపేసి వచ్చేసిన కొడుకును చూసి, యింతెత్తు ఎగిరిపడ్డాడు ఆ తండ్రి - నాన్‌స్టాప్‌గా కొడుకును తిట్టేసి, అప్పై ఆయాసం తీర్చు కున్నాక తీరిగ్గా, "సర్లే ....సర్లే ... యిక నైనా బుద్ధిగావుండి యీ యాల్టినుంచి మన మల్లెతోట్ని నీవే చూసుకో" అనేసి వూరు చివరవున్న యిరవై ఎకరాల మల్లె తోట బాధ్యతల్ని కొడుకు నెత్తినేసేసి, అంతకు ముందురోజే కొన్న యాభై ఎకరాల ద్రాక్షతోటవేపు ఆ తండ్రి వెళ్ళిపోయాడు.

మల్లెపూవుకు- కన్నెపిల్లకూ చాలా దగ్గర సంబంధం వుందని ఓ తాగుబోతు ఫీలాసఫరు ఎక్కడో అన్నాట్ట-, అది చినబాబు ఎక్కడో బార్లో విన్నాట్ట-!

వికసించిన మల్లెపూవూ - వయ సొచ్చిన ఆడపిల్లా మహా సొంపుగా పసం దుగా వుంటాయట.

బెడ్‌రూంలో మగాడు ఆడదంటే ఎం తిష్టపడిపోతాడో- ఆడది మల్లెపూవంటే అంతిష్టపడిపోతుందట! మల్లెపూవును- కన్నెపిల్లను చీదరించుకునే మగాళ్ళు యీ ప్రపంచంలో వుండరు-అంచేత అలా ఎవరైనావుంటే ఆ మగోళ్ళు మరోజాతికి చెందినవాళ్ళై వుండాలి.

రాజమ్మ పదహారేళ్ళది - పదహారేళ్ళ రాజమ్మలో అందం చాలా లేతది. ఒక్క అందమేకాదు.... ఆమె మొత్తం శరీరం లేతదే- ఆ లేతశరీరం చాలా నాజూ కైంది ..ముట్టుకుంటే మరకలుపడేలా... పట్టుకుంటే జారిపోయేలా వుంటుంది.

మల్లెపూవులాంటి కన్నెపిల్ల రాజమ్మ. ఆ పిల్ల మల్లెతోటలో చెంగు చెంగున ఎగుర్తుంటే.... ఆమె యవ్వనం గుండెల మీద నిండుగా పొంగి వూగుతుంటే.... ఆమె అందం పావడాలో కదుల్తుంటే.... వెళ్తున్న రాజమ్మను వెనకనించి చూసిన చినబాబు ఎర్రెక్కిపోయాడు - కసెక్కి పోయాడు- 'యింకేదో' అయిపోయాడు.

అనక నిద్రపట్టక-రాత్రంతా రాజమ్మ ఆలోచనల్తో ఆడుకొని జాగారంచేశాడు. కళ్ళు ఎరుపెక్కి .... వళ్ళు వేడెక్కి .... యింకా తెల్లారకముందే...స్కూటరెక్కి తోటలోకి వచ్చేశాడు.

అప్పటికింకా తోటమాలి నిద్రలేవ లేదు కనుక- గేటు తెరవబడలేదు.

ఒళ్ళుమండిన చినబాబు హారన్‌బటన్ వేళ్ళతో నొక్కేశాడు.

పదినిముషాలకు తోటమాలి నిద్ర కళ్ళతో పరుగున వచ్చాడు. గేటు బయ టున్న చినబాబుని చూడగానే అతని కళ్ళ మీద నిద్రమత్తు గేటుదాటి పరిగెత్తింది. పొద్దెక్కందే లేవని చినబాబు యింత పొద్దుటే లెగిసిందేంటి సెప్మా - అను కుంటూ గేటు తెరిచాడు.

చినబాబు స్కూటర్ దిగ్గానే అడిగాడు- "ఆ అమ్మా యెవరు?"

తోటమాలి తికమకపడిపోయాడు.

మళ్ళీ చినబాబే అన్నాడు. "అదేనోయ్ మనతోట్లో పన్జేస్తుందే" అంటూ వివరాలు చెప్పాడు.

సాంతం విన్న తోటమాలి గుండెల్లో పెద్ద బండరాయి అడ్డంగా పడింది. వీరి కన్ను రాజమ్మమీద పడిందేంటి సెప్మా- అనుకుంటూ ఆలోచన్లో పడిపోయాడు.

చినబాబు విసుక్కున్నాడు - కసురుకున్నాడు.

చివరికి తోటమాలి తనకు తెలిసిన వివరాలు చెప్పాడు.

అతని మాటల్ని బట్టి, రాజమ్మ కింకా పెళ్ళికాలేదు- చాలా బీదపిల్ల-ఒక జబ్బు తండ్రి- వెనక పెద్దగా బలగం లేదు- 'ఫరవాలేదు' అనుకున్న చినబాబు "ఊఁ .... సర్లే .... ఆ పిల్ల రాగానే.... సాయంత్రం నన్నోసారి కలవమను." అనేసి వచ్చినంతవేగంగా వెళ్ళిపోయాడు.

ఆ పిల్లతో, చినబాబుకి పనేంటిసెప్మా- అనుకుంటూ మళ్ళీ తోటమాలి నిద్రపోయాడు

ఆ సాయంత్రం చినబాబు తోటలోకి వచ్చాడు.

ఆడకూలీలు వొక్కొక్కళ్ళే వెళ్ళిపోతున్నారు వాళ్ళు వుదయంనుంచి కోసిన మల్లెపూలు ఓ చోట గుట్టగా పడివున్నాయి. మగకూలీలు ఆ మల్లెపూలను బుట్టల్లోకి ఎక్కిస్తున్నారు.

చివరిగా రాజమ్మ మిగిలిపోయింది.

ఆ తోటలోవున్న గెస్టుహవుస్‌లో కూర్చుని, రాజమ్మకోసం ఎదురుచూస్తున్నాడు చినబాబు.

చివరిగా మిగిలిన రాజమ్మ, చివరికి రానే వచ్చింది.

అపుడే మసకచీకట్లు అలుముకుంటున్నాయ్.

రాజమ్మను చూసిన చినబాబు మనసు కుప్పిగంతులేసింది ఆనందంతో.

"రా.... రాజమ్మా" అంటూ ఆమె కెదురొచ్చి ఆహ్వానించాడు.

ఆమె లోనికెళ్ళలేదు-గడప బయటే నిలబడి, భయం భయంగా అతనివేపు చూసింది.

చినబాబు కంటికి రాజమ్మ సౌందర్య దేవతలా కనిపించింది.


రాజమ్మ కంటికి చినబాబు మన్మధుడిలా కనిపించలేదు గాని, ఖరీదైన మగాడిలా కనిపించాడు.

అంత ఖరీదైన మగాడు తనను లోనికి ఆహ్వానిస్తున్నాడంటే .... ఏదో కారణం వుండే వుంటుంది- అని అనుకుంది కానీ అపై ఆలోచించే తెలివి ఆమెకు లేదు.

"నీ కోసమే ఎదురుచూస్తున్నా .... లోనికిరా రాజీ" అనేసి ఆమె చేయి పట్టుకున్నాడు.

రాజమ్మలో నరాలు సరాగాలాడాయి- ఆమె వొళ్ళంతా విద్యుత్ ప్రసరించినట్లయింది

ఆమెను లోపలికి లాక్కొచ్చాడు.




అనక తలుపులు బిగించాడు.

"తలుపు లెందుకేస్తున్నారు!" ఆమె అడిగింది. ఆ మాటల్లో అనుమానం లేదు- అమాయకత్వం వుంది.

"రాజీ.... మై స్వీట్ డార్లింగ్" అంటూ ఆమెను కౌగలించుకున్నాడు.

ఆమె వుక్కిరిబిక్కిరై పోయింది – ఆమె శరీరంలో కొన్ని భాగాలు వత్తిడికి లోనయ్యాయి- అక్కడ.... ఆ చోట్ల నుంచి ఏర్పడిన ప్రకంపనాలకు ఆమె శరీరం యావత్తూ కంపించిపోతోంది - చిన్నగా వణికిపోతోంది. ఏదో గుర్తొచ్చి నట్టు అతన్ని తోసేసింది.

దూరంగా నెట్టబడ్డ చినబాబుకి ఆమె మీద తెగ కోపం వచ్చేసింది.

ఆమె కళ్ళలో భయం ప్రస్ఫుట మౌతోంది.

"రాజీ.... నా మాట విను....కాదనకు ....యీ తోటంతా నీ కిచ్చేస్తాను....మల్లె పూలుతెచ్చి నీకు పరుపేస్తాను....నీ కాళ్ళ ముందు నా హృదయాన్ని పరిచేస్తాను." ఆ తర్వాత యింకా చాలా అన్నాడు. చివరికి పెళ్ళికూడా చేసుకుంటానన్నాడు

ఏది ఏమైనా-

ఆ గెస్టుహవుసులోకి అరవిచ్చిన మల్లెలా వెళ్ళిన రాజమ్మ నలిగిన మల్లెలా తిరిగొచ్చింది.

చినబాబు డైరీలో మరో ఆడదాని జీవితపు పేజీ చిరిగిపోయింది.

ఆ తర్వాత-

ప్రతిరోజూ- మసక చీకటివేళ చిన బాబు గెస్టుహౌస్‌కి వెళ్తానే వున్నాడు- రాజమ్మ నలిగిన మల్లెపూవులా ఏ అర్థ రాత్రివేళో ఆ గెస్టుహౌస్‌లోంచి బయట పడుతూనే వుంది.

చాలా మసకచీకట్లు మాసిపోయాక -

ఓ చీకటిరాత్రి-!

రాజమ్మ అతనితో చెప్పింది- 'నేను నెలతప్పా'నని.

చినబాబుకి అర్థంకాలేదు.

అసమర్థుడైన విద్యార్థి పరీక్షలు తప్పి నట్టు - అందమైన ఆడపిల్ల నెలతప్పడం ఏమిటి... ఏమిటో అతనికి మాత్రం అవ గాహన కాలేదు-

అమె తెగ సిగ్గుపడిపోతూ, మరోసారి విడమర్చి చెప్పింది.

చినబాబు గుండెల్లో వేయి శతఘ్నులు పేలాయి-

ఓసి! ఎంతపని చేసేసినావే .... ఏదో అందమైన ఆడపిల్లవు కదాని దయతలచి ....ఇంత సుఖాన్ని పంచియిస్తుంటే .... కడుపని చెప్పడాని కెంతధైర్యం....చెప్పి తివి సరే....ఆ నేరం అంతా నాదేనా.... ఇది నేను చచ్చినా ఒప్పుకోను.... ఆడది శీలం కోల్పోయిన ప్రతిసారీ మగాడు కూడా శీలం కోల్పోతున్నాడన్న యీనాటి సామాజిక సిద్ధాంతంబట్టి .... ఆమె కార ణంగా తనూ శీలం కోల్పోయాడు .... కనుక శీలంచెడిన మగాడ్ని ఏ కన్నెపిల్ల పెళ్ళాడుతుందిరోయ్.... ఇక లాభంలేదు ... దీని అందంతో ....దీని ఒంపుల్తో.... దీని ఒమ్ము రాపిళ్ళతో.... తనని మన్మథ సాగరంలో ముంచేసింది బాబోయ్!

దీనికి పరిష్కారం ఏమిటి.... ఏమిటి ....?- ఈ విధమైన ఆలోచనల్తో చిన బాబు బుర్ర వేడెక్కిపోయింది.

ఆమె హఠాత్తుగా "మన పెళ్ళెప్పుడు చినబాబూ!" అంది.

"పెళ్ళేమిటి!" తెల్లబోయాడు.

"నాకు కడుపు-!"

"నీకు కడుపైతే నే నెందుకు పెళ్ళి చేసుకోవాలి! పూళ్ళో చాలామంది ఆడో ళ్ళకి కడుపులొస్తున్నాయ్! ఆళ్ళందర్నీ నే పెళ్ళి చేస్కుంటున్నానా పిచ్చి మొగమా!"

రాజమ్మకు పరిస్థితి అర్థమయింది.

కొద్దిసేపు గొల్లుమంది.

చివరికి అతని కాళ్ళమీదపడి బావురు మంది.

ఆమె ఎన్నివిధాల ఏడ్చినా చినబాబు గుండె కరగలేదు.

ఇక మాటలతో- ఏడుపులతో చిన బాబును మార్చలేం- అనుకున్న రాజమ్మ "యీ విషయం పెదబాబుగారికి చెప్తాను" అంది.

"చెప్తే చెప్పుకో" అన్నాడు చాలా నిర్లక్ష్యంగా.

"నన్నెందుకు పెళ్ళిచేసుకోరో నేను చూస్తాను! పెదబాబు ధర్మప్రభువులు. నా మాట వింటారు. నా కన్యాయం జరక్కుండా చూస్తారు." ఆమె గొణుక్కుంటూ, ఏడ్చుకుంటూ అక్కడ్నుంచి పరుగుతీసింది.

ఆమె వెళ్ళిపోయాక చినబాబు కెందుకో భయంవేసింది.

ఆమె అన్నంతపనీ చేస్తుందా .... నాన్నతో ఈ విషయం చెప్తుందా....?

మైగాడ్! ఆయన నిజంగానే ధర్మప్రభువు....ఆడది కన్నీళ్ళు పెట్టుకున్నా .... ఆడదానికి అన్యాయం జరిగినా ఆయన సహించలేడు .... రాజమ్మను పెళ్ళిచేసుకోమని అంటే తనేం కావాలి?

**చూద్దాం ఏం జరుగుతుందో - అను**కున్న చినబాబు మనశ్శాంతి లేక పూటుగా తాగేసి, మరో రాజమ్మలాంటి ఆడపిల్ల కోసం వూరిమీద పడ్డాడు.

ఆ మర్నాడు –

అతి కష్టంమీద పెదబాబుని కలుసుకుంది రాజమ్మ.

"ఎవరు నీవు?" ప్రశాంతంగా ప్రశ్నించాడు ఆ బాబు.

తన గోడు చెప్పుకుంది రాజమ్మ.

పెదబాబు హృదయం ద్రవించి పోయింది. ఆడదాని కన్నీటికి కోటలెన్నో కదిలిపోతాయ్. ప్రస్తుతం తను కూర్చున్న కుర్చీ కదిలిపోతుందేమోనని భయపడి పోయాడు.

రాజమ్మ బలవంతంగా తన ఏడ్పుని దిగమింగుకుంది.

పెదబాబు తేలిగ్గా నిట్టూర్చి, తన కుర్చీ వంక చూసుకొని, అపై ఆమెవేపు చూసి 'అమ్మాయ్' అన్నాడు.

అమ్మాయ్ తలెత్తిచూసింది.

"నీ బాధను అర్థంచేసుకోగలను. అన్యాయం నీ ఒక్కదానికే కాదు.... ఎందరెందరో ఆడవాళ్ళకు జరుగుతూనే వుంది. ఏడ్పువల్ల న్యాయం జరుగుతుందా-?....లేదు....నీ రుధిర రోదనకు న్యాయం పారిపోతుందేగాని, ప్రయోజనం చేకూరదు."

"అయితే నన్నేం చేయమంటారు బాబు."

"తిరగబడు."

"ఎవరిమీద-?"

"నీ కన్యాయం చేసినవాడిమీద."

"అమ్మో! చినబాబుగారిమీదే."

"ఏం.... వాడొక మూర్ఖుడు.... న్యాయం ఎక్కడైతే చంపబడ్తుందో, అక్కడే నీలాంటివాళ్ళు తిరగబడి మూర్ఖుల్ని చీల్చి చెండాడాలి. నీ జీవితపు పచ్చనిచెట్టుకు పుట్టిన చీడపురుగును మొదటే సంహరించేయ్. లేనిచో అది మొత్తం నీ జీవితాన్నే సర్వనాశనం చేస్తుంది."

అతని మాటల్లో ఏ ఒక్కమాట అర్థం కాలేదు రాజమ్మకి.

"అమ్మాయ్. నీ సమస్యకు పరిష్కారం యింతకంటే మరొకటి లేదు."

"అంటే చినబాబుగారితో నా పెళ్ళి జరగదా?"

"ఎంత అమాయకంగా అడుగుతున్నావ్ అమ్మాయ్! అందాన్ని ఆస్వాదించడమే వాడికి తెల్సుకానీ ఆదరించడం తెలీదు. దోసిల పాలకోసం శాశ్వతంగా ఓ గేదెను కొనుక్కునే హీనుడుకాడు వాడు. రోజుకొక నెత్తురు రుచిమరిగిన పులి ఒకే నెత్తురుకోసం ఎప్పుడూ ప్రయత్నించదు. ఆడది కేవలం ఆటవస్తువుగా తలచినవాడెన్నడూ ఒకే ఆడదానితో సుఖపడలేడు...."

"బాబూ....? మీ మాటలు నాకేం తెలవడంలేదు."

"విడమర్చి చెప్పాలా అమ్మాయ్! చినబాబు మానవత్వం వున్నవాడైతే, నిన్నిలా మోసగించి వుండడు. నిన్ను పెళ్ళిచేసుకోమని వాడికి నేను చెప్పినా, నామాట వినడు. నిజంగా వాడు నా మాట వించే నీతోపాటు పధ్నాలుగుమంది అమ్మాయిల్నిచ్చి వాడికి పెళ్ళిచేయాలి నేను....!"

"అంటే...."

"పిచ్చిదానా! మోసపోయింది నీ వొక్కదానివే కాదు- నీకంటే ముందు పదముగ్గురు ఆడవాళ్ళున్నారు. వాళ్ళు కూడా నీలాగే నా దగ్గరకు వచ్చారు.... నేను మాత్రం ఏం చేయగలను.... వాడు నా చేయిదాటిపోయాడు...."

రాజమ్మ మరోసారి ఏడ్వబోయింది.

ఆమె ప్రయత్నాన్ని గమనించి పెదబాబు కుర్చీని గట్టిగా పట్టుకున్నాడు.

మరెందుచేతనో రాజమ్మ కళ్ళలోంచి కన్నీళ్ళు రాలేదు.

"వాడి విషయంలో విసిగిపోయానమ్మాయ్ - ఇంకా ఎందరి ఆడవాళ్ళ జీవితాల్ని నాశనం చేస్తాడు....ఇటువంటి వాడు నా కొడుకని చెప్పుకోడానికి తలవంపుగా వుంది. ఈ దుర్మార్గుణ్ణి కన్నందుకు యిప్పటికే కుమిలిపోతున్నాను. వాడ్ని యిలాగే వదిలేస్తే యింకెందరి ఆడవాళ్ళ కన్నీళ్ళను నే చూడాలో"

కొద్దిసేపు ఆగి బాధపడిపోయాడు పెదబాబు.

అనంతరం- "అమ్మాయ్.... నాదో కోరిక, తీర్చగలవా?"

"ఏమిటి బాబు?"

"నా కొడుకును చంపగలవా?"

స్థంభించిపోయింది రాజమ్మ.

కన్నతండ్రిగా ఈ చేతుల్తో వాన్ని చంపలేను. వాడ్ని చంపి, నాకింత మనశ్శాంతినిచ్చి పుణ్యంకట్టుకో తల్లీ" చేతులెత్తి నమస్కరించేశాడు పెదబాబు.

"లేదు... ఈ పని నేను చేయలేను."

"ఎలాగూ నీ బ్రతుకు నాశనమైపోయింది. నీకోసం కాకపోయినా మరో ఆడదాని బ్రతుకు నాశనం కాకుండా వుండాలంటే.... వాడు బ్రతగ్గూడదు."

"కొడుకుమీద ప్రేమ లేకపోయినా, ఏ తండ్రీ మీలా చెప్పడు బాబు."

"వాడు చేసిన నేరాలకు ఏ న్యాయ స్థానం శిక్షించలేదు, రక్తసంబంధాలు- మమతానురాగాలు యిప్పుడు కాదు కావల్సింది. ఈ దౌర్భాగ్యుడు చేసిన పాపాల్ని సమూలంగా సమాధి చేయడమే నేను కోరుకుంటున్నాను.

"బాబు! ఈ భూమ్మీద న్యాయం యింకా చచ్చిపోలేదని చెప్పటానికి మీ రొక్కరు చాలు...."

"ఆ న్యాయం కోసమే నిన్ను తిరగ బడమంటున్నాను- వాడ్ని ముక్కలు ముక్కలుగా నరికి నీ కసి తీర్చుకో" ఆవేశంతో పల్కిన పెదబాబు మాటల్తో పాటు- ఆరంగుళాల పొడవున్న స్టీల్ కత్తి 'ఖంగ్' మంటూ రాజమ్మ పాదాల ముందు పడింది.

రాజమ్మ అదిరిపడి ఒక్కడుగు వెనక్కి వేసింది.

"ఊఁ.... తీస్కో ఆ కత్తి.... ఈ రోజుతో వాడి చరిత్ర అంతమవ్వాలి. మరో కొత్త శకానికి నాంది పల్కాలి నీవు."

"వద్దు.... చినబాబుని నేను చంపలేను." కంపించిపోయిందామె.

"వాడ్ని చంపి నీకు న్యాయం చేకూర్చుకుంటావో- లేక జీవితంలో ఎన్నడూ వాడి మొహం చూడకుండా వుంటావో.... నీ యిష్టం.... ఆలోచించు" అనేసి పెదబాబు లోనికి వెళ్ళిపోయాడు.

ఆలోచనల్తో రాజమ్మ బుర్ర గిర్రున తిరిగిపోసాగింది.

చాలా సేపటికి ఓ స్థిరనిర్ణయానికొచ్చిన రాజమ్మ తన పాదాలముందు పడివున్న కత్తిని చేతిలోకి తీసుకుంది.

ఆ తెల్లారి-

కత్తిపోట్లకు గురైన రాజమ్మ శవాన్ని ఆ వూరి చెరువులోంచి బయటకు తీశారు కొందరు.

ఈ వార్త తెల్సిన పెదబాబు - చినబాబు దుఃఖించారు.... ఆనందంగా!-

